సాక్షి
జగిత్యాల

సోమవారం। 7। ఆగస్టు। 2023

ఎస్సైలుగా ఎంపికైన యువకులు


జగదీశ్వర్ రాజేశ్వర్ విక్రం కిరణ్

జగిత్యాలక్రైం/సారంగాపూర్: జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన బాదినేని జగదీశ్వర్ ఎస్సైగా ఎంపికయ్యారు. అలాగే జిల్లా కేంద్రంలోని చిలుకవాడకు చెందిన పడాల రాజేశ్వర్ ఎస్సైగా ఎంపికయ్యారు. బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన ఆడెపు విక్రం అగ్నిమాపక శాఖలో ఎస్సైగా ఎంపిక అయ్యారు. నర్సింహులపల్లెకు చెందిన వెయ్య కిరణ్ పోలీస్‌శాఖలోని ఫింగర్ ప్రింట్ బ్యూరో(సీఐడీ) విభాగంలో ఏఎస్సైగా ఎంపికయ్యారు.

గరిష్టం/కనిష్టం
32.0/24.0
వాతావరణం
ఆకాశం దట్టమైన మేఘాలతో కమ్ముకుని ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి. జిల్లాలో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మంత్రి కొప్పుల దిగ్భ్రాంతి


గద్దర్‌తో మంత్రి కొప్పుల ఈశ్వర్(ఫైల్)

గొల్లపల్లి (ధర్మపురి): ప్రజా గాయకుడు గద్దర్ మరణంపై మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో తన గళంతో కోట్ల మంది ప్రజలను ఉత్తేజపరిచిన గద్దర్ మరణం బాధాకరమన్నారు. గద్దర్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గద్దర్‌కు మరణం లేదని ప్రజాకవి చెన్నాడి వెంకట రమణారావు అన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం


వేడుకల్లో పూర్వ విద్యార్థులు

మల్యాల(చొప్పదండి): స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో 1998–1999లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ముత్యంపేటకు వచ్చి కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. అనంతరం బావు గంగాధర్, బండారి రాజు, పొన్నం మహేశ్, దుల్లూరి గోపి, ఇట్టిరెడ్డి అంజిరెడ్డి, ఉప్పు నరేశ్, కట్కూరి మల్లేశం ఐతరవేని కొమురయ్య అపూర్వ సమ్మేళనం నిర్వహించారు.

కల్లుగీత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


అభివాదం చేస్తున్న నాయకులు

మల్యాల(చొప్పదండి): ముత్యంపేటలోని దిగువ కొండగట్టు గౌడ సంఘ భవనంలో ఆదివారం గౌడ జనక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జగిత్యాల రెండో మహాసభలు నిర్వహించారు. సభలకు సంఘం జిల్లా అధ్యక్షుడు మనోజ్ అధ్యక్షత వహించారు. కల్లుగీత కార్మికులను ఆదుకోవడం కోసం కల్లుగీత కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రూ.5వేల కోట్లు కేటాయించాలని మనోజ్ డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిలివేరి శ్రీనివాస్‌గౌడ్, మల్యాల మారుతిగౌడ్, పులి మారుతిగౌడ్, మల్యాల శ్రీకర్‌గౌడ్, బుర్ర అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోనే జీపీఎఫ్ సేవలు


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జగిత్యాల: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇకనుంచి జిల్లా కేంద్రంలోనే జీపీఎఫ్ లావాదేవీలు అందుబాటులోకి వస్తాయని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జీపీఎఫ్ సేవలు జిల్లా కేంద్రంలోనే నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్టీయూ నాయకుల ఆధ్వర్యంలో ఆమెకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వసంత మాట్లాడుతూ, జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల జీపీఎఫ్ ఖాతాల బదలాయింపు ప్రక్రియ పూర్తయిందన్నారు. వీటికి సంబంధించిన వెరిఫికేషన్ తుదిదశలో ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు భైరం హరికిరణ్, మచ్చ శంకర్, మేకల ప్రవీణ్, సలీమ్, విద్యమని కృష్ణ, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన బాపురెడ్డి


సీఎం కేసీఆర్‌తో బాపురెడ్డి

కథలాపూర్ (వేములవాడ): మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ఆదివారం అసెంబ్లీలో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విన్నవించారు.

రిపేరు భారం రూ.2కోట్లు


జగిత్యాలలో విద్యుత్ మోటార్లు మరమ్మతు చేస్తున్న మెకానిక్‌లు


మోటార్‌ను రిపేర్‌కు తీసుకెళ్తున్న రైతు

- భారీవర్షాలు మిగిల్చిన నష్టం
- కాలిపోతున్న కరెంట్ మోటార్లు
- నిత్యం 15వరకు రిపేరు సెంటర్లకు..
- రోజుల తరబడి రైతుల పడిగాపులు

జగిత్యాలఅగ్రికల్చర్: భారీవర్షాలు ఒకవైపు పంటలను తీవ్రంగా దెబ్బతీశాయి. మరోవైపు.. రూ.వేలు వెచ్చించి ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లనూ ధ్వంసం చేశాయి. వీటిని మరమ్మతు చేయించేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కరెంటు మోటార్లు ఒకేసారి రిపేర్‌కు రావడంతో మరమ్మతులకు చాలాసమయం తీసుకుంటోందని అన్నదాతలు వాపోతున్నారు. కాలిపోయిన, వరదలో కొట్టుకుపోయిన, నీళ్లుచేరిన విద్యుత్ మోటార్ల రిపేరుకే దాదాపు రూ.2 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది.

ధ్వంసమైన లక్ష విద్యుత్ మోటార్లు..

- జిల్లాలో దాదాపు 3 లక్షల వరకు వ్యవసాయ పంపుసెట్లు ఉన్నాయి.
- అందులో సుమారు లక్ష వరకు ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్నాయి.
- చాలామంది రైతులు వాగులు, చెరువుల ఒడ్డున విద్యుత్ మోటార్లు అమర్చారు.
- మరికొందరు రైతులు వ్యవసాయ బావుల గట్లపై ఏర్పాటు చేశారు.
- భారీవర్షాలు, వరదలతో కుంటలు, చెరువు కట్టలపై ఉన్న కొన్ని విద్యుత్ మోటార్లు కొట్టుకుపోయాయి.
- ఇసుక మేటల కింద మరికొన్ని విద్యుత్ మోటార్లు కూరుకుపోయాయి. వాటి ఆచూకీ ఇప్పటికీ లభించడం లేదు.
- మరికొందరు ఆటోమేటిక్ స్టార్టర్లు ఏర్పాటు చేసి, కరెంట్ మోటార్లు ఆన్‌చేసి ఇళ్లకు వెళ్లాక.. వరద రావడంతో షార్ట్ సర్క్యూట్ అయి అవి పూర్తిగా కాలిపోయాయి.
- మరికొన్ని వరద నీటిలో మునిగిపోయి పనిచేయకుండా తయారయ్యాయి.

భారీ నష్టం..

త్రీఫేజ్ విద్యుత్ మోటార్ ధర కనీసం రూ.30వేల నుంచి రూ.40 వేల వరకు ఉంటుంది. ఇలాంటి కరెంట్ మోటార్లు వర్షపునీటిలో కొట్టుకుపోయి రైతులకు భారీనష్టం జరిగింది. లోనికి నీరు వెళ్లడంతో కనీసం నాలుగు కిలోలు ఉండే రాగి తీగలు కాలిపోయాయి. ఇలా కాలిపోయిన మోటార్‌ను రిపేర్ సెంటర్‌కు తీసుకు వెళ్లడం రైతులకు కష్టం. ఇలాంటి కాలిపోయిన విద్యుత్ మోటార్‌ను రిపేర్ చేయడానికి రూ.2,500 వరకు మెకానిక్‌లు చార్జీ తీసుకుంటున్నారు. నాలుగైదు రోజులపాటు వరద నీటిలో ఉన్న విద్యుత్ మోటార్ కాలిపోకపోతే .. దానిని విప్పించి, వార్నిష్ చేయిస్తున్నారు. ఇలాంటి పనులకు రూ.500 వరకు చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇవి చాలవన్నట్లు.. వర్షానికి ఫ్యూజ్ బాక్స్‌లో ఉండే స్టార్టర్లు, ఫ్యూజులు పనిచేయడంలేదు. వీటి మరమ్మతులకు మరో రూ. 1,000 వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. అలాగే, మోటార్‌ను విప్పాలన్నా, మళ్లీ ఫిట్ చేయాలన్నా ఒకరిద్దరు హెల్పర్ల సేవలు అవసరమవుతున్నాయి. దీంతో, ఈ సీజన్‌లో ఒక్కో విద్యుత్ మోటారు మరమ్మతుకు దాదాపు రూ.4వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒక రైతుకు నాలుగైదు మోటార్లు ఉంటే ఆ ఖర్చు కనీసం రూ.25 వేలు దాటుతోంది.

మోటారు కాలిపోయింది



వర్షం రాకముందు రెండెకరాల్లో వరి నాటు వేసిన. ఆటోమేటిక్ స్టార్టర్ వేసి నీళ్లు అందిస్తున్న. రాత్రికిరాత్రే వాగు పొంగింది. కరెంట్ మోటార్‌లోకి నీళ్లు పోయినయి. అది కాలిపోయింది. దాని రిపేరుకు రూ.5వేలు ఖర్చయ్యింది.

– నందిరెడ్డి తిరుపతిరెడ్డి, చిన్నమెట్‌పల్లి, కోరుట్ల

ఇసుక మేట వేసింది



నాకున్న రెండున్నర ఎకరాల్లో వరి నాటేసిన. వర్షాలతో పొలంలో ఇసుక మేటలు వేసినయి. కరెంటు మోటార్ అందులో కనబడకుండా పోయింది. పంట పండే పరిస్థితి లేదు. కొత్త మోటార్ కొనాల్సిందే.

– ఏలేటి తిరుపతి, చిన్నమెట్‌పల్లి, కోరుట్ల

రోజూ పది వస్తున్నాయి



వర్షాలు తగ్గుముఖం పట్టగానే రోజూ 10 వరకు కరెంట్ మోటార్లు రిపేరుకు వస్తున్నాయి. ఉదయం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు పనిచేస్తున్నం. అయినా సమయానికి రైతులకు అందివ్వలేకపోతున్నం. తొందరగా రిపేరు చేయాలని దుకాణం ముందే ఉంటున్నరు.

– భోగ గంగాధర్, రిపేర్ సెంటర్ నిర్వాహకుడు, జగిత్యాల

జగిత్యాల జైత్రయాత్ర నుంచి.. 'గల్ఫ్ గోస' వరకు..

కోరుట్ల/సారంగాపూర్: 'రైతు కూలీల్లారా పిడికిలి బిగించండి.. దున్నేవాడిదే భూమి.. దొరల గడీల పాలనకు చరమగీతం పాడండి' అంటూ 1978 సెప్టెంబర్ 9న జగిత్యాల జైత్రయాత్రలో నినదించిన ఆ స్వరం.. 2022లో మల్లాపూర్ మండలం మొగిలిపేటలో నిర్వహించిన 'గల్ఫ్ గోస – చెరుకు రైతుల ప్రయాస సభ' వరకు ఎక్కడా తగ్గలేదు. మొగిలిపేట సభలో తీవ్ర ఉద్వేగానికి లోనైన ఆయన.. 'ఊపిరి ఉన్నంత వరకు ప్రజల పాటై పాడుతా.. ప్రజల పాటై బతుకుతా.. ప్రజల పాటై చచ్చిపోతా' అన్న ప్రజాయుద్ధ నౌక గద్దర్ మాటలు జనం గుండెల్లో ఇప్పటికీ మార్మోగుతూనే ఉన్నాయి.


మొగిలిపేటలో 'గల్ఫ్ గోస- నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ' సభలో పాట పాడుతున్న గద్దర్(ఫైల్)

- రైతుకూలీ సభ నుంచి షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ దాకా..
- జగిత్యాల ఉద్యమాల్లో గద్దర్, ఆటాపాట.. కాలిగజ్జెల సవ్వడి

జగిత్యాల జైత్రయాత్ర..

సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్, మావోయిస్టు పార్టీల నిర్మాణానికి ఊపిరిలూదిన జగిత్యాల జైత్రయాత్రలో అప్పటి విప్లవ రథసారథులు ముప్పాల లక్ష్మణ్‌రావు, కొండపల్లి సీతారామయ్య, శీలం నరేశ్, మల్లోజుల కోటేశ్వర్‌రావు, కిషన్‌జీ, మల్లా రాజిరెడ్డిలతో కలిసి గద్దర్ పాల్గొన్నారు. జననాట్య మండలి తరఫున తనదైన బాణీలో మాట–పాట కలిపిన తూటాల్లాంటి పాటలు.. ప్రసంగాలతో రైతు కూలీలను ఉర్రూతలూగించారు. జగిత్యాల గడీల్లో దొరల పాలన, వెట్టిచాకిరీ, భూస్వాముల ఆగడాలపై పాట రూపంలో ధ్వజమెత్తారు. ఈ పాట జగిత్యాల జిల్లాలో పీపుల్స్‌వార్ ప్రాబల్యం కొనసాగినపుడే కాదు.. ఇప్పటికీ మారుమూల పల్లెజనం గుండెల్లో ప్రతిధ్వనిస్తుంది.

- ప్రజాయుద్ధ నౌక గద్దర్ అప్పుడు నవయువకుడు. విప్లవ కళాకారులతో కలిసి తన గళం వినిపించారు.
- తెలంగాణ ఉద్యమ సమయంలో 2007 సంవత్సరంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో గద్దర్ సారథ్యంలో 'తెలంగాణ ధూంధాం' కీలక పాత్ర పోషించింది. ఈ సభలో 'పొడుస్తున్న పొద్దు మీద గానమా.. పోరు తెలంగాణమా' అన్న పాటతో గద్దర్ తెలంగాణ ఉద్యమకారులను పోరుబాటలో ఉరకలెత్తించారు. 2008లో తెలంగాణ ఉద్యమంలో దళిత బహుజనుల్లో చైతన్యం నింపడానికి కథలాపూర్ మండలం దూలూర్‌లో బహిరంగ సభ నిర్వహించారు.
- 2018 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి తరఫున సారంగాపూర్ మండలం పెంబట్ల, రేచపల్లి గ్రామాల్లో గద్దర్ ఎన్నికల ప్రచారం చేశారు.


మా తుఝేసలాం సభలో గద్దర్

- 2021 ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రజా గాయకుడు మారంపల్లి రవి ఆధ్వర్యంలో కథలాపూర్ మండలం భూషణ్‌రావుపేటలో నిర్వహించిన 'మా తుఝే సలాం'కార్యక్రమంలో గద్దర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎర్రజెండా చేతబట్టి కాలిగజ్జెల సవ్వడిలో అమ్మ మనసు గొప్పతనాన్ని.. భరత మాత విశిష్టతను విడమరిచి చెబుతూ ఆయన పాడిన పాటలు విప్లవ కవి మాటున దాగిన మనసున్న కవి కనిపించేలా చేశాయి.
- 2022 సెప్టెంబర్‌లో నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ తెరిపించాలని రైతుసంఘం ఆధ్వర్యంలో సాగిన పోరుకు మద్దతుగా.. గల్ఫ్ గోసలకు చెల్లుచీటి పలకడానికి ప్రవాసీ సంక్షేమబోర్డు ఏర్పాటు లక్ష్యంగా చెన్నమనేని శ్రీనివాస్‌రావు మల్లాపూర్ మండలం మొగిలిపేటలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో గద్దర్ పాల్గొన్నారు. చెరుకు రైతుల గోడు.. గల్ఫ్ కార్మికుల సమస్యలను తన యాసలో.. బాణీలో పాటలుగా పాడి ప్రజల్లో చైతన్యం నింపారు. 'ప్రజాపాటనై పుట్టా.. బతికా.. ప్రజాపాటగానే చచ్చిపోతా' అని ఉద్వేగంతో అన్న మాటలు జనం గుండెల్లో ఇప్పటికీ మార్మోగుతున్నాయి.

సార్ జీవితం.. ఉద్యమానికి అంకితం


నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ లత


నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వసంత


సెల్యూట్ చేస్తున్న ఎస్పీ భాస్కర్

- అదనపు కలెక్టర్ బీఎస్ లత
- ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి
- చిత్రపటం వద్ద నివాళి అర్పించిన ప్రముఖులు

జగిత్యాల: ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితమంతా తెలంగాణ సమాజం కోసం, తెలంగాణ ఉద్యమం కోసం ధారపోశారని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ఆశ, శ్వాసగా జీవించి ఉద్యమానికి దిక్సూచిగా నిలిచారని కొనియాడారు. తొలిదశ ఉద్యమంలో కొట్లాడి, తెలంగాణ మలిదశ ఉద్యమంలో రాష్ట్రసాధనకు మార్గనిర్దేశనం చేశారని స్మరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో లక్ష్మీనారాయణ, డీపీవో దేవరాజు, అదనపు డీఆర్డీవో నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆరాధ్యదైవం 'ప్రొఫెసర్'

జగిత్యాలజోన్: తెలంగాణ ప్రజల ఆరాధ్యదైవం ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం కోసం తపించిన గొప్ప ఉద్యమకారుడు సార్ అని అన్నారు. ఆయన ఆశయాలను కేసీఆర్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా నేరవేరుస్తూ వస్తోందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రామానుజాచారి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

జీవితం త్యాగం చేసిన సార్..

జగిత్యాలజోన్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని ఎస్పీ భాస్కర్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ, ప్రొఫెసర్‌జయశంకర్ జీవితం నేటి యువతరానికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీ వెంకటస్వామి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్, ఆర్‌ఐలు జానీమియా, వేణు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

- రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు
- లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు
- ప్రభుత్వ ఆస్పత్రిలో పాలు, పండ్లు పంపిణీ


పాలు, పండ్లు పంపిణీ చేస్తున్న మోర హన్మాండ్లు

రాయికల్(జగిత్యాల): తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యాన్నిస్తాయని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. ఆదివారం రాయికల్ పట్టణంలో లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు మాట్లాడారు. తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమన్నారు. ముర్రుపాలు తాగిస్తే పిల్లలు ఆరోగ్యకరంగా ఉంటారని అన్నారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాటిపెల్లి రాంరెడ్డి, నాయకులు మ్యాకల రమేశ్, చౌడారపు లక్ష్మీనారయణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొమ్ముల ఆదిరెడ్డి, కార్యదర్శి మోసరపు శ్రీకాంత్, కోశాధికారి గంట్యాల ప్రవీణ్, సభ్యులు మచ్చ శేఖర్, దాసరి గంగాధర్, వాసం ప్రసాద్, కొయ్యడి మహిపాల్‌రెడ్డి, రాంప్రసాద్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు

- పంపిణీకి అధికారుల సన్నాహాలు
- వినియోగంలోకి రానున్న గ్రామీణ క్రీడా ప్రాంగణాలు

పెగడపల్లి(ధర్మపురి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పల్లెప్రగతిలో భాగంగా తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు నిర్మించింది. ఉపాధిహామీ పథకం ద్వారా ఒక్కోదానికి సుమారు రూ.1.50 లక్షల – రూ.5 లక్షల వరకు వెచ్చించింది. అయితే, ఇందులో వాలీబాల్, ఖోఖో ఆడేందుకు అవసరమైన క్రీడాపరికరాలు సమకూర్చింది. పూర్తిస్థాయి ఆటవస్తువులు లేకపోవడంతో క్రీడాకారులు నిరుత్సాహంతో ఉన్నారు.

ఏడాది క్రితం ప్రారంభం..

- జిల్లాలోని అన్ని మండలాల్లో కనీసం రెండు చొప్పున క్రీడా ప్రాంగణాలను 2022 జూన్ 2న అధికారులు ప్రారంభించారు.
- ఆ తర్వాత మిగతా గ్రామాల్లో దశల వారీగా క్రీడా ప్రాంగణాలు ఆరంభించారు.
- తొలుత వాలీబాల్, ఖోఖోలకు తప్ప మిగతా క్రీడలకు అవసరమయ్యే ఎలాంటి క్రీడా పరికరాలు పంపిణీ చేయలేదు.
- దీంతో జిల్లాలోని 419 క్రీడా ప్రాంగణాలు నామమాత్రంగా మారాయనే విమర్శలు ఉన్నాయి.


పెగడపల్లిలో పంపిణీకి సిద్ధంగా ఉన్న స్పోర్ట్స్ కిట్లు

క్రీడాకారుల్లో సంతోషం..

కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీకి సిద్ధం కావడంతో ప్రాంగణాల్లో ఆటలు ఆడితే వాటికి కొత్తశోభ సంతరించుకుంటుందని క్రీడాభిమానులు అంటున్నారు. క్రీడా సామగ్రి కూడా అందుబాటుకి వస్తుండడంతో క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేస్తుండటంతో క్రీడలకు ప్రాధాన్యం ఏర్పడింది. గ్రామీణ క్రీడాకారులు సాధన చేసేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయి.

- ప్రాంగణాలు చిన్నగా ఉంటడం, క్రీడా సామగ్రి లేకపోవడంతో యువత, విద్యార్థులు ఆటలు ఆడేందుకు ఆసక్తి చూపలేదు.
- ఫలితంగా సుమారు 13 నెలలుగా వినియోగంలో లేక క్రీడా ప్రాంగణాలు పిచ్చి మొక్కలు పెరిగి అధ్వాన్నంగా మారాయి.
- వీటిని వినియోగంలోకి తెచ్చి క్రీడలను పోత్సహించేందుకు రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు మంజూరు చేశారు.
- ఇవి జిల్లాలోని మండల పరిషత్ కార్యాలయాలకు ఇటీవల చేరాయి.
- త్వరలో గ్రామ పంచాయతీలకు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

స్పోర్ట్స్ కిట్లలో ఉండేవి ఇవే..

కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లలో మేజరింగ్ టేపు 1, డిస్కస్ త్రో 1, 2 కిలోలు, టెన్నికాయిట్ రింగ్‌లు 6, స్కిప్పింగ్ రోప్‌లు 4, ప్లాస్టిక్ విజిల్స్ 3, స్టాప్ అండ్ గో వాచెస్ 1, సింథటిక్ వాలీబాల్ 1, నెట్ 1, సైకిల్ పంపు బిగ్ సైజ్ (పుట్ పంపు)1 ఉంటాయి. అదేవిధంగా జిమ్‌లో ఉండే డంబెల్స్ మూడు సెట్లు, టీషర్టు 75, క్రికెట్ బ్యాట్ నెం.5, కశ్మీర్ విల్లో 1, ఫుల్‌సైజ్ బ్యాట్ 1, బ్యాటింగ్ గ్లౌజులు ఒకజత, లెగ్ ప్యాడ్లు రెండు జతలు, వికెట్ కీపింగ్ లెగ్‌గార్డు ప్యాడ్ ఒక జత, స్టంప్స్ సెట్ 2 జతలు, లబ్‌డామినల్ గార్డ్స్ 2 జతలు, ప్రాక్టీస్ బాల్స్ 6, ఆర్మ్ గార్డ్స్ 2, థైప్యాడ్లు 4, క్రికెట్ కిట్ బ్యాగ్ 1 ఉన్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్రప్రభుత్వం క్రీడా ప్రాంగణాలకు స్పోర్ట్స్ కిట్లను సరఫరా చేసింది. వీటిని త్వరలో మండల అధికారులు గ్రామ పంచాయతీలకు పంపిణీ చేస్తారు. క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి. క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి జిల్లాకు మంచిపేరు తేవాలి.

– రవి, జిల్లా యువజన సర్వీసులు, క్రీడల అధికారి

క్లుప్తంగా

ప్రజల గొంతుకగా నిలిచిన గద్దర్


ప్రజా గాయకుడు గద్దర్‌తో మారంపల్లి లక్ష్మణ్

మల్యాల: ప్రజా గాయకుడు గద్దర్ జ్ఞాపకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని కళాకారుడు మారంపల్లి లక్ష్మణ్ అన్నారు. కళాకారులు గద్దర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజల గొంతుకగా గద్దర్ నిలిచారన్నారు. ఆయనతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకుంటూ నివాళి అర్పించారు. కార్యక్రమంలో కళాకారులు మారంపల్లి లక్ష్మణ్, మల్యాల సతీశ్, నారాయణ, పొన్నం మహేశ్ పాల్గొన్నారు.

గద్దర్ మృతి అణగారిన వర్గాలకు తీరని లోటు

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్: ప్రజా యుద్ధ నౌక, జన నాట్య మండలి వ్యవస్థాపక సభ్యుడు, ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం అణగారిన వర్గాలకు తీరని లోటన్నారు. 1978లో వరంగల్ రీజినల్ ఇంజినీరింగ్ కాలేజ్(ఆర్‌ఈసీ)లో మొట్టమొదటిసారి తాను ఇంటర్ విద్యార్థిగా గద్దర్‌ను చూశానని తెలిపారు. అప్పుడు విద్యార్థులనుద్దేశించి ఆయన చేసిన ప్రసంగాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. గద్దర్ కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

మంత్రి గంగులపై ఆరోపణలు చేసిన వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం: వక్ఫ్ బోర్డుకు చెందిన ఆస్తులను మంత్రి గంగుల కమలాకర్ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్నాడని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కమిటీ (కాంగ్రెస్) అధ్యక్షుడు సమద్ నవాబ్‌ను శనివారం అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై ఆదివారం మధ్యాహ్నం విడుదల చేశారు. కరపత్రాలతో మసీదుల వద్ద మంత్రిపై అసత్య ప్రచారం చేస్తున్నాడని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు సీపీ సుబ్బారాయుడికి ఫిర్యాదు చేశారన్నారు. నవాబ్ అరెస్టు విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు సీపీతో మాట్లాడారు. ఈ ఘటనను ఖండిస్తూ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు.

చెట్లు నరికిన వ్యక్తులపై కేసు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కాట్రపల్లిలో రాజగోపాల్‌కు చెందిన స్థలంలో నిమ్మ, అశోక చెట్లను అదే గ్రామానికి చెందిన వ్యక్తులు తాడూరి మొగిలి, ముప్పు అశోక్, సంగాల సదానందం నరికివేశారని ప్రకృతి ప్రేమికులు ఆదివారం ఫిర్యాదు చేశారు. చెట్లపై కోతుల చేరి, ఇబ్బందులు కలిగించడం వల్లే నరికివేశామని చెబుతున్నారని తెలిపారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రమేశ్ పేర్కొన్నారు.

రహదారులపై పోలీసుల నిఘా

- ప్రమాదకర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు
- సైన్‌బోర్డులతో హెచ్చరికలు
- జిల్లాలో 55 హాట్‌స్పాట్ల గుర్తింపు
- రోడ్డు ప్రమాదాల నియంత్రణ లక్ష్యం

సాక్షి ఫోకస్


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ ఆరీఫ్, ఎస్సై సదాకర్

జగిత్యాలక్రైం: హైవే తోపాటు, ప్రధాన రోడ్లపై నిత్యం జరుగుతున్న ప్రమాదాలను అరికట్టి కారకులపై చర్యలు తీసుకునేందుకు పోలీసు శాఖ ఆధునిక సాంకేతికత వినియోగిస్తోంది. తద్వారా కారకులను గుర్తించి, బాధితులకు సకాలంలో న్యాయం చేయడం సులభతరమవుతోంది. జాతీయ రహదారుల తోపాటు, మెయిన్ రోడ్లలోని అత్యంత ప్రమాదకర ప్రాంతాల్లో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రమాదాల నియంత్రణకు సైన్‌బోర్డులను బిగించారు.

అత్యంత ప్రమాదకర ప్రాంతాలు..

- జిల్లా సరిహద్దుల్లోని గండిహనుమాన్ ఆలయం, ఇబ్రహీంపట్నం క్రాస్‌రోడ్డు, ఆరెపేట క్రాస్‌రోడ్డు, మోహన్‌రావుపేట క్రాస్‌రోడ్డు, మేడిపల్లి ఎస్సారెస్పీ ప్రధాన కాలువ, తాటిపల్లి క్రాస్‌రోడ్డు అత్యంత ప్రమాదకర ప్రాంతాలుగా పోలీసులు గుర్తించారు.
- వీటితోపాటు చల్‌గల్ ఎల్లమ్మ దేవాలయం, సుబి ఐస్ ఫ్యాక్టరీ, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల, తిప్పన్నపేట, పొలాస వ్యవసాయ కళాశాల, అనంతారం రోడ్డు డ్యామ్, కల్లెడ సబ్‌స్టేషన్, బుగ్గారం బస్టాప్, నేరెళ్ల క్రాస్‌రోడ్డు, తుమ్మెనాల క్రాస్‌రోడ్డు, తిమ్మాపూర్ బస్టాండ్, రాయపట్నం ప్రాంతాల్లోనూ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తేల్చారు.
- జాతీయ రహదారిపై వాహనాలు అతివేగంతో తరచూ ప్రమాదాలకు గురయ్యేవి.
- ప్రజలు కూడా రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు.
- ఈ క్రమంలో పోలీసు శాఖ ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టింది.
- జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు జాతీయ రహదారిని దాటకుండా డివైడర్, రెయిలింగ్ ఏర్పాటు చేసింది.
- దీంతో ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి.

ప్రమాదాల నియంత్రణకు..

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పోలీసు శాఖ ప్రతీ మండలంలో ఎస్సైతో కమిటీ ఏర్పాటు చేసింది. రోడ్డు ప్రమాదాలు జరిగే హాట్ స్పాట్లను రోడ్లు, భవనాల శాఖ అధికారులతో కలిసి సైన్‌బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు, ప్రమాద స్థలాల్లో ఉన్న వ్యాపారులు, స్థానికులకు రోడ్డు ప్రమాదాలు జరిగితే సత్వరమే స్పందించాలని అవగాహన కల్పిస్తున్నారు.

ప్రమాదకారకుల గుర్తింపు

- ప్రమాద స్థలాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో ప్రమాద కారకులను సులభవంగా గుర్తిస్తున్నారు.
- ఇటీవల జరిగిన పలు ప్రమాదాలకు కారణమైన వాహనాలను గుర్తించి చర్యలు తీసుకున్నారు.
- అలాగే ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే స్పందించేలా స్థానిక వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పిస్తుండటంతో ప్రమాదాలు ఎలా జరిగాయో వారు ప్రాథమికంగా వెల్లడిస్తున్నారు.
- ఇతర ప్రాంతాల్లో ప్రమాదాలు చేసి పారిపోతున్న వాహనాలను గుర్తించి వారిని పట్టుకుని చర్యలు తీసుకుంటున్నారు.
- రాంగ్ రూట్లో వెళ్లే వాహనదారులను సైతం గుర్తించి చర్యలు తీసుకుంటుండడంతో చాలామంది వాహనదారులు నిబంధనలు అతిక్రమించడం లేదు.
- దీంతో ఆయా ప్రాంతాల్లో చాలామట్టుకు ప్రమాదాలు నియంత్రణలోకి వస్తున్నాయి.

ప్రమాదాల నివారణకు చర్యలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. పోలీస్‌స్టేషన్ల పరిధిలో హాట్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాల నియంత్రణకు సైన్‌బోర్డులు ఏర్పాటు చేశాం. ఎక్కడైనా ప్రమాదం జరిగితే స్థానిక వ్యాపారులు, ప్రజలు సత్వరమే స్పందించి ప్రాణనష్టం జరగకుండా చూసేలా అవగాహన కల్పిస్తున్నాం.

– భాస్కర్, ఎస్పీ

వృద్ధురాలి ఆత్మహత్య

శంకరపట్నం: మండలంలోని కరీంపేటకు చెందిన ఏనుగుల ఎల్లవ్వ(77) ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ నారాయణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఎల్లవ్వకు ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త కొన్నేళ్ల క్రితం మృతిచెందడంతో చిన్న కుమారుడు రాజయ్య వద్ద ఉంటోంది. శనివారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి టీవీ చూసి పడుకుంది. ఆదివారం తెల్లవారుజామున చూడగా ఆమె కనిపించలేదు. అనుమానంతో రాజయ్య వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా అందులో ఎల్లవ్వ మృతదేహం కనిపించింది. దీంతో అతను పోలీసులకు సమాచారం అందించాడు. వయసు పైబడటంతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న దేవేందర్‌గౌడ్

ఇల్లందకుంట: మండల కేంద్రానికి చెందిన మోటపోతుల దేవేందర్‌గౌడ్ అనే గీత కార్మికుడు ఆదివారం తాటిచెట్టు పైనుంచి పడటంతో తీవ్రంగా గాయపడ్డాడని స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారని పేర్కొన్నారు.

పర్సు పోయిందని ఠాణా భవనం ఎక్కాడు

- కరీంనగర్‌లో యువకుడి హంగామా


పోలీస్‌స్టేషన్ భవనంపై కూర్చున్న రాజు

కరీంనగర్ క్రైం: కరీంనగర్ బస్టాండ్‌లో నా పర్సు పోయింది.. దొరకకుంటే చచ్చిపోతానంటూ ఓ యువకుడు వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ భవనం పైకి ఎక్కి, హంగామా చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. గన్నేరువరం మండలంలోని జంగపల్లికి చెందిన చింటు అలియాస్ రాజు పర్సును శనివారం రాత్రి కరీంనగర్ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడు. రాత్రి నుంచి పోలీసులకు చెబుతుంటే పట్టించుకోవడం లేదంటూ ఆదివారం ఠాణా భవనం పైకి ఎక్కి, కూర్చున్నాడు. పర్సు దొరకకుంటే దూకి చనిపోతానని బెదిరించాడు. పోలీసు సిబ్బంది అతన్ని కిందకు దింపే ప్రయత్నం చేసినా వినకుండా అరగంటపాటు హంగామా చేశాడు. చివరికి రాజును మాటల్లో పెట్టి, పైకి వెళ్లి తీసుకువచ్చారు. అతను మద్యం మత్తులో ఉన్నట్లు పేర్కొన్నారు.



అ'పూర్వ' సమ్మేళనం

గంభీరావుపేట: మండలకేంద్రంలోని వివేకానంద హైస్కూల్‌లో 2007–08 విద్యా సంవత్సరంలో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం దత్తసాయి ఫంక్షన్ హాల్‌లో జరిగింది. 15 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరికొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను సన్మానించారు. అనంతరం ఆనందోత్సాహాలతో ఆడిపాడారు. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు ఎడ్లు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. వెదిరకు చెందిన పన్యాల లచ్చిరెడ్డి భూమిని అదే గ్రామానికి చెందిన శనిగరపు మల్లేశం అనే రైతు వరి నాటు వేసేందుకు ఆదివారం గొర్రుతో చదును చేస్తున్నాడు. ఈ క్రమంలో పొలం గట్టు పక్కనున్న విద్యుత్ ఇనుప స్తంభానికి విద్యుత్ సరఫరా అయింది. గమనించిన లచ్చిరెడ్డి మల్లేశంను అప్రమత్తం చేయడంతో పొలం గట్టు పైకి వచ్చాడు. విద్యుత్ షాక్‌కు గురై, ఎడ్లు అక్కడికక్కడే మృతిచెందాయి. సంఘటన స్థలాన్ని విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు. ఎడ్ల విలువ రూ.లక్ష పైన ఉంటుందని తెలిపారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

మహిళను వేధించిన కేసులో వ్యక్తి రిమాండ్

జమ్మికుంట: మహిళను వేధించిన కేసులో ఓ వ్యక్తిని రిమాండ్‌కు పంపించినట్లు జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని మారుతి నగర్‌కు చెందిన ఓ మహిళను జమ్మికుంట పట్టణానికి చెందిన ఓరుగంటి శ్రీనివాస్‌రావు(రౌడీ షీటర్) నెల రోజులుగా వెంట పడుతూ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. శనివారం కిరాణా దుకాణానికి వెళ్లగా వెంబడించి, అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె ప్రశ్నించడంతో చేయి చేసుకొని, అసభ్య పదజాలంతో దూషించి, చంపుతానని బెదిరించాడు. బాధిరాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం శ్రీనివాస్‌రావును అరెస్టు చేసి, రిమాండ్ తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

మల్లాపూర్‌లో చోరీ

ధర్మారం: మండలంలోని మల్లాపూర్‌కు చెందిన జుట్టు లక్ష్మణ్ ఇంట్లో దొంగలు పడ్డారు. బాధితుడి కథనం ప్రకారం.. లక్ష్మణ్ ఆదివారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లిపోయాడు. వృద్ధురాలైన అతని తల్లి లచ్చమ్మ ఇంట్లో ఉండి, మధ్యాహం పక్కింటికి వెళ్లింది. ఈ సమయంలో దొంగలు ఇంటి తలుపులను తొలగించి, లోపలికి ప్రవేశించారు. బీరువాలోని రూ.24 వేలు ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పెద్దపల్లి సీఐ అనిల్, ధర్మారం ఎస్సై అశ్విని సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. క్లూస్ టీం సభ్యులు వెలిముద్రలు సేకరించారు. ఈ ఘటనపై లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పథకం ప్రకారమే హత్య


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రవీణ్ కుమార్

- రెండ్రోజుల క్రితం డీ–40 కాలువలో యువకుడి మృతదేహం లభ్యం
- ఇద్దరి నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ ప్రవీణ్‌కుమార్

కోరుట్ల : రెండ్రోజుల క్రితం పట్టణ శివారులోని డీ–40 కాలువలో అనుమానాస్పదంగా మృతిచెందిన షేక్ సమీర్ (22) హత్యకేసును పోలీసులు ఛేదించారు. ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ప్రవీణ్ కుమార్ నిందితుల వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బీముని దుబ్బలో నివసిస్తున్న షేక్ సమీర్ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అంబేద్కర్ నగర్‌కు చెందిన కండ్లె ఈశ్వర్ (23), నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తన స్నేహితుడు ఉట్నూర్ బాలా శంకర్ ఈనెల 2న రాత్రి సమీర్‌ను డి–40 కాలువ వద్దకు పిలిపించుకొని ముగ్గురు మద్యం తాగారు. ఈ క్రమంలో కండ్లె ఈశ్వర్, సమీర్ గొడవపడగా అప్పటికే పథకం ప్రకారం తమతో తెచ్చుకున్న నైలాన్ తాడును ఉట్నూర్ బాలా శంకర్, ఈశ్వర్‌లు సమీర్ మెడకు చుట్టి హత్యచేశారు. మృతదేహంతో పాటు ద్విచక్ర వాహనాన్ని కాలువలో పడేశారు. రెండ్రోజుల క్రితం డీ–40 కాలువలో సమీర్ మృతదేహం లభ్యంకాగా మృతుడి బావ అమీర్ కండ్లె ఈశ్వర్‌పై అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కల్లూర్ రోడ్డులో ఈశ్వర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా తన భార్యతో సమీర్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతోనే హత్యచేసినట్లు ఒప్పుకున్నాడు. అందుకు తన స్నేహితుడు బాలా శంకర్ సాయం తీసుకున్నాడని, రూ.40 వేలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఈశ్వర్ తెలిపాడని సీఐ వెల్లడించారు. నిందితుల వద్ద రెండు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు, హత్యకు ఉపయోగించిన నైలాన్ తాడును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించనున్నట్లు చెప్పారు. ఎస్సై కిరణ్ కుమార్, కానిస్టేబుళ్లను సీఐ అభినందించారు.

అల్లీపూర్‌లో దొంగతనం

- మూడు తులాల బంగారం, రూ.లక్ష చోరీ


ఘటనాస్థలిలో పరిశీలిస్తున్న ఎస్సై విజేందర్

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన చిక్కుడు రవీందర్ ఇంట్లో దొంగతనం జరిగింది. ఎస్సై విజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రవీందర్ పాల వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం ఉదయం పాలు సేకరించేందుకు ఇంటి తలుపులు దగ్గరకు వేసి, కుటుంబసభ్యులతో కలిసి డెయిరీ ఫాం వద్దకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా ఇంట్లోని సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉంది. బీరువాలో ఉన్న 3 తులాల బంగారం, రూ.లక్ష ఎత్తుకెళ్లినట్లు తెలిపాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చందాలతో వలస కూలీ అంత్యక్రియలు

- నాడు అమ్మ.. నేడు నాన్న మృతి
- అనాథలుగా ముగ్గురు కూతుళ్లు
- కొదురుపాకలో ఘటన


శేఖర్ మృతదేహం

బోయినపల్లి(చొప్పదండి): పదేళ్ల క్రితం తల్లి స్వప్న, ఇప్పుడు తండ్రి చనిపోవడంతో ముగ్గురు కూతుళ్లు అనాథలుగా మారారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా లంబాడిపల్లికి చెందిన గంధం శేఖర్–స్వప్న దంపతులు పాతికేళ్ల క్రితం మండలంలోని కొదురుపాక గ్రామానికి వలస వచ్చారు. ఇక్కడే పాతముంపు గ్రామం పరిసరాల్లో గుడిసెలో నివాసముంటూ ఉంటూ, మేకల కాపర్లుగా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వీరికి శ్యామల, స్రవంతి, శైలజ, రాజేశ్వరి, పంచముఖి ఐదుగురు కూతుళ్లు కాగా శేఖర్ భార్య స్వప్న పదేళ్ల కింద అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి కూతుళ్ల బాగోగులు శేఖర్ చూసేవాడు. ఇందులో శ్యామల, స్రవంతి, వివాహాలు జరిగాయి. ముగ్గురు చిన్నారుల్లో శైలజ స్థానిక కేజీబీవీలో ఇంటర్, రాజేశ్వరి, పంచముఖి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఒకరు ఏడు, మరొకరు ఐదో తరతగతి చదువున్నారని గ్రామస్థులు తెలిపారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న శేఖర్ ఆదివారం మృతిచెందాడు. అంత్యక్రియలకు వారివద్ద చిల్లిగవ్వ లేకపోవడంతో గ్రామ మత్స్యకార్మికల సంఘం ఆధ్వర్యంలో రూ.12వేల చందాలు వసూలు చేసి అంత్యక్రియలు నిర్వహించారు. శేఖర్ కూతుళ్లను ప్రభుత్వం ఆదుకోవాలని సంఘం నాయకులు రాగుల మల్లేశం, ర్యాకం అనీల్, కల్లెం శ్రీనివాస్, పందుల దేవయ్య విజ్ఞప్తి చేశారు.

ఆకతాయిల ఆగడాలకు చెక్

- మహిళల భద్రతకు షీటీంలు
- పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు
- వేధింపులపై ఫిర్యాదు చేస్తే సత్వరమే చర్యలు



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థినులు (ఫైల్)

జగిత్యాలక్రైం: జిల్లాలో కళాశాలలు, పాఠశాలల్లో చదివే విద్యార్థినులు, మహిళలకు భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షీ టీంలు ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్టు వేస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా షీటీం బృందాలు ప్రత్యేక జనసంచారం ఉన్న చోట మఫ్టీలో తిరుగుతూ ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. రద్దీ ప్రాంతాలు, బస్టాండ్లు, విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో షీటీం పోలీసులు మఫ్టీలో ఉంటూ ఆకతాయిలకు చెక్ పెడుతున్నారు. జగిత్యాల, మెట్‌పల్లి సబ్ డివిజన్ల పరిధిలో షీటీం పోలీసులు ఆశాఖ పనితీరుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పెద్ద పట్టణాలతో పాటు, మండలకేంద్రాల్లోని బస్టాండ్ కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. అయినా వారికి ఆకతాయిల వేధింపులు తప్పడం లేదు. వారి రక్షణకోసం రాష్ట్ర ప్రభుత్వం షీటీంలను ఏర్పాటు చేసింది.

భద్రతకు ప్రాధాన్యం

మహిళలు, విద్యార్థినుల రక్షణకు షీటీం బృందాలు నిరంతరం కృషి చేస్తున్నాయి. వచ్చిన ఫిర్యాదులను స్వీకరిస్తూ ఆకతాయిల ఆగడాలను వీడియో రికార్డ్ చేయడంతో పాటు కొన్ని సందర్భాల్లో కేసులు సైతం నమోదు చేస్తున్నారు. జగిత్యాల, మెట్‌పల్లి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో 20 మండలాల్లో షీటీం బృందాలు పనిచేస్తున్నాయి. టీమ్‌లో ఎస్ఐ స్థాయి అధికారి, కానిస్టేబుల్ ఉంటారు.

అవగాహన సదస్సులు

ఆకతాయిలు వేధిస్తే వెంటనే షీటీంకు సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతున్నారు. చీటింగ్‌పై పోలీసు శాఖ అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా జనవరి నుంచి ఇప్పటి వరకు 69 చోట్ల అవగాహన సదస్సులు నిర్వహించారు. వేధింపులకు గురిచేసే ఆకతాయిలు ఎక్కువగా సంచరించే 175 అడ్డాలు గుర్తించారు. ఇప్పటి వరకు 27 ఫిర్యాదులు రాగా, మూడు కేసుల నమోదుతో పాటు, 13 మందిపై ఈ పెట్టి కేసులు నమోదు చేసి, 11 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా షీటీం 80 పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సు నిర్వహించగా ఇందులో 7వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. అసభ్యకరంగా ప్రవర్తిస్తే 1930 లేదా డయల్ 100, 87126 70783కు వాట్సాప్‌లో సంప్రదించాలని పోలీసులు సూచిస్తున్నారు.

అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలి



గ్రామీణ ప్రాంతాల్లో షీటీం పోలీసులు అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలి. దీంతో మారుమూల గ్రామీణ ప్రాంతాల మహిళలు, విద్యార్థినులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ధైర్యంగా ముందుకొస్తారు. షీటీం చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు బాగున్నాయి.

– మారు సత్తమ్మ, మహిళా సంఘం అధ్యక్షురాలు, జగిత్యాల

ధైర్యంగా ఫిర్యాదు చేయాలి



బస్టాండ్, పాఠశాలలు, కళాశాలల వద్ద మహిళలను వేధించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. జగిత్యాల సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో మహిళల రక్షణపై అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాలలు, కళాశాలల వద్ద షీటీం ఫోన్ నంబర్లు తెలిసేలా ఏర్పాటు చేశాం. ఆకతాయిల వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు నిర్భయంగా ముందుకురావాలి.

– భాస్కర్, ఎస్పీ